క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



భిక్కనూరు: తిప్పాపూర్‌లో నిర్మించనున్న అయ్యప్ప ఆలయానికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏనుగు బాపురెడ్డి, శోభ దంపతులు రూ.25,555ను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు వారిని సన్మానించారు. తిప్పాపూర్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, ప్రతినిధులు ద్యావర సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సారెడ్డి ఉన్నారు.

దేవాలయాలను పరిరక్షించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): దేవాలయాలను పరిరక్షిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుంట రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మాన్ని కాపాడే ప్రతి ఒక్కరిని గౌరవిస్తామన్నారు. హైదరాబాదులో నీ ఓ ప్రాంతంలో పెద్దమ్మ ఆలయం ధ్వంసం చేయడం, రాహుల్ గాంధీ హిందువులను ఉద్దేశించి వ్యాఖ్యానించిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి చక్రధర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు గురుడు సాగర్, కార్యవర్గ సభ్యులు రమేష్ రెడ్డి, మోహన్ రాజ్, నరేందర్, భాస్కర్, సత్యం రెడ్డి, గోపాల్ రెడ్డిపాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థినికి అభినందన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం హైస్కూల్‌కు చెందిన డి.అశ్విని అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సుకుమార్‌గౌడ్ తెలిపారు. కామారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో భాగంగా మంగళవారం చేపట్టిన అండర్–16 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో అశ్విని పాల్గొని బహుమతి సాధించినట్లు ఆయన చెప్పారు. వచ్చే నెల 3, 4 తేదీలలో వరంగల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అశ్విని పాల్గొననుందని ఆయన వివరించారు.

హైటెన్షన్ సర్వీసులకు సింగిల్ విండో ఏర్పాటు

కామారెడ్డి అర్బన్: హైటెన్షన్(హెచ్‌టీ) సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్ఈ ఎన్.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసిన వాటికి దరఖాస్తు సంఖ్య వస్తుందని, వెంటనే సంబంధించిన అధికారులకు ఎస్టిమేట్‌కు వెళ్తుందని, లోకేషన్ సందర్శించి సాధ్యాసాధ్యాలు అంచనాలు చేసి అప్‌లోడ్ చేసి కార్పొరేట్ ఆఫీసు ద్వారా అనుమతులు మంజూరు చేస్తారని, మౌలిక వసతుల ఏర్పాటుకు పొందుపర్చిన సమయానుగుణంగా పనులు జరుగుతాయని ఎస్ఈ పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఎర్రాపహాడ్‌లో మంగళవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నాయకులు మహేందర్‌రెడ్డి, బద్దం మల్లేష్, గైని రాజలింగం, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ చారీ, రాజీవ్ కుమార్, అఖిల్‌రావు, మోహన్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి అటవీ రేంజ్ పరిధిలోని ఎర్రాపహాడ్, మెంగారం సెక్షన్ సిబ్బంది.. విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



బాన్సువాడలో నాగదేవత విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు



నస్రుల్లాబాద్‌లో..



బీర్కూర్‌లో..



పిట్లంలో..



మహమ్మద్‌నగర్‌లో..



బేగంపూర్ గ్రామ శివారులో..

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లాలో నాగుల పంచమి పండుగను మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానికంగా ఉన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగదేవతకు స్వీట్లు, జొన్న పేలాలు పోసి టెంకాయలు కొట్టారు. అనంతరం ఆవు పాలతో కుటుంబ సభ్యుల కళ్లు కడిగి దీవెనలు తీసుకున్నారు. పలుచోట్ల ఆవు పాలను ఉచితంగా పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డి పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు, యువతులు



గాంధారి భోగేశ్వరాలయంలో..



తాడ్వాయి శివారులో..



మద్నూర్‌లో ..



రాజంపేటలో..



సదాశివనగర్ నాగులమ్మ వద్ద..



దోమకొండలో..



భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో భజన కార్యక్రమం



ఉప్పర్‌పల్లిలో..



రాజంపేటలో ఆవు పాలు పంపిణీ చేస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు



జిల్లా కేంద్రంలో ఆవుపాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు



బాన్సువాడ: రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



గోపాల్‌పేటలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద..



బిచ్కుందలోని నాగేంద్రుడి ఆలయంలో భక్తులు



తాడ్వాయిలో కోలాటం వేస్తున్న స్థానికులు

సమాచారం..

31న ఇంటర్ ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 31న చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీల విభాగంలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పెద్దకొడప్‌గల్ బాలికల కళాశాలలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల/పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొయ్యగుట్ట గురుకుల కళాశాలలో ..

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఈనెల 31న ఇంటర్‌లో ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధృవపత్రాలు పరిశీలించి అదేరోజు సాయంత్రం ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

మద్నూర్ గురుకుల కళాశాలలో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లారగేట్ వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో చదవడానికి సీట్లు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ స్వప్న మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల మెరిట్ ఆధారంగా మాత్రమే ఎంపిక జరుగుతుందని ఆమె అన్నారు.

రేపు గాలి గోపురం ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: స్థానిక పెద్దబజార్‌లోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ గడప, గాలిగోపురాన్ని ఈ నెల 31న గురువారం ఉదయం 10.54 గంటలకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆవిష్కరిస్తారని ధనుర్మాస ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

‘అభివృద్ధి’ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి



ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులు, మహిళా సంఘాల అభివృద్ధి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో ప్రకాష్, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

బాన్సువాడ: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు అన్నారు. మంగళవారం తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రతి ఒక్కరికి మొక్కలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం అంతే ముఖ్యమన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



సదాశివనగర్ (ఎల్లారెడ్డి): సదాశివనగర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. మహేందర్ రెడ్డితో పాటు వీడీసీ చైర్మన్ ముదాం సత్యంతోపాటు మరి కొంత మంది కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్ రెడ్డికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి రోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా మాస్టర్ భరత్ అన్నారు. కన్‌కల్ గ్రామంలోని రెడ్డి సంఘం భవనంలో పతంజలి యోగా ఆధ్వర్యంలో ఉచిత యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 19న ఈ యోగా శిక్షణ ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న వారు ఈ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రెండు గంటల పాటు శిక్షణ కార్యక్రమంలో భరత్ పాల్గొని యోగాసానాలు వేసి, యోగా ప్రత్యేకత గురించి తెలియజేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

- వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందిస్తున్న మైలారం గ్రామస్తులు
- ఆదర్శంగా నిలుస్తున్న యువత



మైలారంలో ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామ యువకులు

నస్రుల్లాబాద్: ఒకరికి వచ్చిన కష్టం నలుగురు పంచుకుంటే పలుచబడుతుందనడాన్ని మైలారం గ్రామ యువకులు పాటిస్తున్నారు. ఓ కుటుంబంలో సభ్యుడు మరణిస్తే మైల పోయే వరకు పోషణ భారంగా మారుతుంది. సామాన్య మధ్య తరగతి కుటుంబం అయితే అంత్యక్రియలకు సైతం అప్పు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాని కుటుంబానికి కాస్త ఆసరాగా నిలవాలన్న ఉద్దేశంతో నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో ‘ఓం శాంతి’ అని వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి దాని ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ గ్రూప్ దాదాపు 330 మంది గ్రామస్తులు ఉన్నారు. ఇందులో గ్రామంలో ఎవరు మరణించినా వారికి తోచిన విధంగా ఆర్థిక సహాయం అందిస్తారు. సహాయాన్ని యువకులు వారి దశదిన కర్మ రోజున కుటుంబ సభ్యులకు అందిస్తారు. గ్రామంలో గత వారం క్రితం నుంచి ముగ్గురు మరణించారు. దీనితో గ్రూపు సభ్యుల సహకారంతో ఒక్కో కుటుంబానికి రూ.10–15వేల నగదును సోమవారం అందించారు.

అలా ఆలోచన పుట్టింది..

మైలారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల విద్యుత్ ప్రమాదంలో అకస్మాత్తుగా మరణించాడు. ఆయన కుటుంబంలో ఇద్దరు అమ్మాయిలు ఉండటం .. ఆర్థికంగా బలంగా లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన వారే ఖర్చులు పెట్టుకున్నారు. అంత్యక్రియల సమయంలో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో యువకులు ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని అందులో యాడ్ చేశారు. అప్పటి నుంచి ఎవ్వరు చనిపోయినా ఆర్థిక సాయం అందిస్తున్నారు. మైలారం గ్రామ యువకుల ఆలోచన పలువురికి ఆదర్శంగా నిలిచింది.

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయండి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తూ..

భిక్కనూరు: ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ డాక్టరేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద మంత్రిని కలిసి ఇంజనీరింగ్ కళాశాల ఆవశ్యకతను గురించి వివరించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, రాహుల్, రమేశ్, సత్యం, మహేశ్, సరిత, రమాదేవి ఉన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్/దోమకొండ: అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ వాల్‌పోస్టర్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మంగళవారం దోమకొండ పర్యటనలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు.. మంత్రిని కలిశారు. ఆగస్టు 7న గోవాలో మహాసభ జరుగుతుందని నాయకులు వివరించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అసైన్డ్ భూములను రక్షించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ దేవాలయ, అసైన్డ్ భూమలను కబ్జాల నుంచి రక్షించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం మంత్రి సీతక్కకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ వివరించారు. విచారణ జరిపి ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో అశోక్‌నగర్‌కాలనీ, పాతరాజంపేట్ వద్ద రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు వెంకట్‌గౌడ్, మోతీరాం, నర్సింలు, అరుణ్ తదితరులున్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సజ్జన్‌పల్లి గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లికి చెందిన భాగ్యలక్ష్మి.. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇందిరమ్మ ఇల్లు కడుతున్నారని గ్రామస్తులు మంగళవారం జెడ్పీ సీఈవో చందర్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భాగ్యలక్ష్మి 1999లో తహసీల్దార్ ద్వారా తనకు స్థలం మంజూరైందని పేర్కొంటూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు తెలిపారు. ఆ స్థలం జీపీ ఆధీనంలో ఉన్నట్లు చెప్పారు. స్థలం లబ్ధిదారుకు చెందినదా.. లేక ప్రభుత్వ భూమా తేల్చాలని గ్రామస్తులు డిమాండు చేశారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభు మంగళవారం పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో ప్రధాన చౌరస్తాల వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు చైర్మన్ సదాశివరెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదుద్దీన్‌లు తెలిపారు. ప్రధాన చౌరస్తాల వద్ద హైమాస్ట్ లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎంపీ సురేష్ షెట్కార్‌ల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేసి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.

ఎల్లాపూర్ తండాలో ప్రత్యేక వైద్యశిబిరం

రాజంపేట: ఎల్లాపూర్ తండా జీపీ పరిధిలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తండాలో పలువురికి విషజ్వరాలు రావడంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎర్రాపహాడ్ మెడికల్ ఆఫీసర్ ఖాసిం తెలిపారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీవో బాలకృష్ణ, హెచ్‌ఈవో నారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సామల నవదీప్ మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్‌అలీ తెలిపారు. నవదీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆగస్టు 3న సామూహిక రక్షా బంధన్

కామారెడ్డి అర్బన్: చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 3న ఉదయం 9 గంటలకు స్థానిక సిరిసిల్ల రోడ్డులోని మార్వాడీ ధర్మశాలలో సామూహిక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జైన్ సంఘం ప్రతినిధి ప్రదీప్‌జైన్ బోరా తెలిపారు. జైనులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పీఏఐ వివరాలను ఆన్‌లైన్ చేయించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్(పీఏఐ) వివరాలను ఈ నెల 31 లోపు ఆన్‌లైన్ చేయించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతోపాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే పంచాయతీల పరిధిలోని ఓటర్ల వివరాలు మెర్జింగ్ షీట్‌లలో రాసి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.